ఓటర్లను ఆకట్టుకునేలా..

- ప్రచారాల్లో పలు విధానాలను ఎంచుకుంటున్న అభ్యర్థులు
- డిజిటల్ హంగులతో మరింత జోరు..
- విజయమే అంతిమ లక్ష్యం



మేనిఫెస్టో ముద్రించిన కరపత్రంతో కాంగ్రెస్ నాయకుల ప్రచారం..



సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ కరపత్రంతో బీఆర్ఎస్ ప్రచారం..

కరకగూడెం: జిల్లా వ్యాప్తంగా ఎక్కడచూసిన ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. పోటీచేస్తున్న పలు పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేందుకు నాయకులు పలు రకాల ప్రచార సాధనాలను వినియోగించుకుంటున్నారు. ఆయా ప్రచార శైలి, వాటిలోని రకాలపై నేటి కథనం..

నేరుగా ప్రచారం..

ఎన్నికల ప్రచారంలో అతిప్రధానంగా భావించే ఘట్టం ఎమ్మెల్యే అభ్యర్థి నేరుగా వెళ్లి ఓటర్లను కలవడం. ఈ క్రమంలో పార్టీల అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రతి ఓటరును పలకరించి తాము చేసిన, చేయబోయే పనులను వివరిస్తున్నారు. గ్రామాల్లో వాహనాల్లో పాదయాత్రల ద్వారా పర్యటించి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

ప్రచార రథాల వినియోగం

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఫొటోలు, పార్టీ గుర్తులు, మెనిఫెస్టోలోని ముఖ్యాంశాలను ప్రచార రథాలకు ఫ్లెక్సీల రూపంలో తగిలించుకుని వివిధ రకాల పాటల రూపంలో గ్రామాల్లో విస్తృతంగా తిరుగుతున్నారు. ఇది ఓటర్లను ఎంతగానో ఆకర్షిస్తోంది.

సభలు, సమావేశాలు

ఎన్నికల సమరంలో వివిధ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించడానికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కొన్ని పార్టీలు వీటిని బ్రహ్మాస్త్రంగా వాడుకుంటున్నాయి. ఇటీవల సీఎం కేసీఆర్ పలు దఫాల్లో జిల్లాలో పలుచోట్ల సభలో పాల్గొనడం, అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రోడ్ షోలో పాల్గొనడం ఇందుకు తార్కాణం. అదేవిధంగా గ్రామాల్లో అసంతృప్తి నాయకులు, పార్టీ ముఖ్యనాయకులతో అభ్యర్థులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తు ఓటర్లను చేరేలా వ్యూహాలు రచిస్తున్నారు.

సామాజిక మాధ్యమాలు

ప్రస్తుత ఎన్నికలు సామాజిక మాధ్యమాల చుట్టే తిరుగుతున్నాయి. పలు పార్టీలు వారి లక్ష్యాలు, ఆలోచనలను రకరకాలుగా డిజైన్ చేసి ఫేస్‌బుక్, వాట్సప్, యూట్యూబ్, ఇన్‌స్టాగాం తదితర మాధ్యమాల్లో హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్షంల నడుమ విమర్శలకు ప్రతి విమర్శలు జోరందుకున్నాయి.

ఫోన్ కాల్స్..

నేను పలాన నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న అభ్యర్థిని.. మీ ఓటు నాకే వేయండి.. మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను.. మీలో ఒకడిగా ఉంటాను.. అని చెప్తూ మీ నియోజకవర్గం అభ్యర్థి నుంచి ఫోన్‌లు వచ్చాయా? అది ఫోన్ కాల్ ద్వారా చేస్తున్న ప్రచారంలో భాగం. పలువురు అభ్యర్థులు వారి పేర్లు, ఎన్నికల గుర్తుతో ఓటర్లకు కాల్స్ చేస్తూ ఇలా ముందుకు సాగుతున్నారు.

అయితే ఈ ప్రచారాలన్నిటిలో కామన్ కనిపించేవి రెండు.. ఒకటి మేనిఫెస్టో, రెండు కార్యకర్తలు. మేనిఫెస్టోలు పలు రకాలుగా ప్రజల వద్దకు చేరుతున్నారు. కరపత్రాలు, డిజిటల్ కరపత్రాలు, పోస్టర్లు, స్టిక్కర్లు ఇలా ఏదో ఒక రూపంలో పైన పేర్కొన్న అన్ని రకాల ప్రచార విధానాల్లో చలామణి అవుతోంది మేనిఫెస్టో. అటు కార్యకర్తలు కూడా ప్రతీ రకమైన ప్రచారాల్లో తమ మార్కు చూపిస్తున్నారు. అభ్యర్థికి వెనుదన్నుగా ఉండి బలాన్ని చేకూరుస్తున్నారు. ఇలా ప్రచారాలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నప్పటికీ త్వరలోనే ముగియనున్నాయి.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు భరోసా

భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి వీరయ్య



భద్రాచలంటౌన్: పట్టణంలో ప్రచారం చేస్తున్న ఛత్తీస్‌గఢ్ మంత్రి లక్మా



చర్ల: రాళ్లగూడెంలో పొదెం వీరయ్య రోడ్‌షోకు ఎదురేగి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చర్ల/దుమ్ముగూడెం: ఇందిరమ్మ రాజ్యం ఏర్పడితేనే రాష్ట్రం, దేశంలో పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల బతుకులకు భరోసా లభిస్తుందని భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పొదెం వీరయ్య తెలిపారు. ఈ మేరకు 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన చర్ల మండలంలోని రాళ్లగూడెం నుంచి చర్ల మీదుగా సుబ్బంపేట వరకు కొనసాగిన రోడ్‌షోలో మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనకు అంతం పలికి ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. సీఎం కేసీఆర్ పదేళ్ల కాలంలో ఉద్యోగాలు ఇవ్వకపోగా... ప్రాజెక్టుల పేరిట దోచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, జెడ్పీటీసీ ఇర్పా శాంత, మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాగా, దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో పొదెం వీరయ్య సతీమణి పద్మ ప్రచారం చేశారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి 30వ తేదీన జరిగే పోలింగ్‌లో హస్తం గుర్తుపై ఓటువేసి వీరయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావుతో పాటు పిలక వెంకటరమణారెడ్డి, బత్తుల శోభన్‌బాబు, సందీప్‌రెడ్డి, మద్ది రాము, లంకా శివకుమార్, మద్ది కుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే భద్రాద్రి అభివృద్ధి

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంతో పాటు భద్రాద్రి రామాలయం, పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని ఛత్తీస్‌గడ్ మంత్రి కోవాసీ లక్మా తెలిపారు. భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపును కాంక్షిస్తూ ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో ఆదివారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరిస్తూ వీరయ్యను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు షేక్ అజీమ్, కుంచాల రాజారాం, నరేష్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సతీష్, వెంకటేష్, సుధీర్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు తీర్చేది బీఆర్ఎస్సే



కరకగూడెం: వెంకటాపురంలో విప్ రేగాకు స్వాగతం పలుకుతున్న మహిళలు



కరకగూడెం: దేవరనాగారంలో ప్రజల సమస్యలు రాసుకుంటున్న రేగా

కరకగూడెం: ప్రజల ఆకాంక్షలు తీర్చేది బీఆర్ఎస్సే పార్టీయేనని ఆ పార్టీ పినపాక అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పాపాయిగూడెం, దేవరనాగారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలెబోయిన వారి ఇలవేల్పు ముల్యారుడు వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను ఓటర్లుకు అందజేసి ఓట్లను అభ్యర్థిచారు. ప్రచార క్రమంలో ఆయన గ్రామస్తులతో కలిసి ఒక చోట కూర్చున్నారు. వారితో మాట్లాడి వారి సమస్యలను నోట్ పుస్తకంలో రాసుకున్నారు. అలాగే ఓ వృద్ధున్ని పలకరిస్తూ పింఛన్ వస్తున్నదా అని పలకరిస్తూ ముందుకు సాగారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

మణుగూరురూరల్: ఎన్నికల్లో రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ.. మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలు, మణుగూరు మున్సిపాలిటీ వార్డుల్లో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ముత్యాలమ్మనగర్ బూత్ ఇన్‌చార్జ్ ఎన్.రమేష్, సర్పంచ్ కొమరం జంపేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనియన్లు, ఉద్యమకారుల మద్దతు

మణుగూరురూరల్: రేగా కాంతారావు గెలుపు కోసం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ డ్రైవర్ల అసోసియేషన్, లారీ ఓనర్స్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్లు, గుమస్తాల సంఘం, బొగ్గు ముఠా యూనియన్ల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. మరోవైపు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రేగాకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రకటించారు.

రాజ్యాంగ దినోత్సవం

అన్నపురెడ్డిపల్లి: రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గుంపెన పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్, జంగాల శ్రీనివాసరావు, జంగాల ఉమ, చల్లా రమేష్, ఇనపనూరి రాంబాబు, చల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఎంపీటీసీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక ఎంపీటీసీ సభ్యురాలు వగ్గెల అనసూయ ఆదివారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో ఆమె పార్టీలో చేరగా, బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

బూర్గంపాడు: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించి అధికారం చేపడుతుందని ఏఐసీసీ సభ్యుడు రమేష్ చెన్నితల అన్నారు. భద్రాద్రి రామయ్య దర్శనం అనంతరం ఆయన సారపాకలో భద్రాచలం దేవస్థాన ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు అనేక కష్టనష్టాలను అనుభవించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనాడూ ప్రజలను కలిసిందిగాని, సచివాలయానికి వచ్చిందిగాని లేదన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణలో నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని, యువత ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పనిచేస్తున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ, ఎంఐఎం పార్టీలు బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు రహస్య అవగాహనతో పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను రోశిరెడ్డి కుటుంబసభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మాజీ ఆర్టీసీ చైర్మన్ నర్సిరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, యడమకంటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానమే ప్రాణదానం

అశ్వాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని భారజల కర్మాగారం జీఎం జగ్గారావు అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో భారజల ఆస్పత్రిలో గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హన్మకొండ వారి సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 95 మంది దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా జీఎం జగ్గారావు మాట్లాడుతూ.. భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎందరికి ప్రాణదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న నటుడు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో సీతారామచంద్ర స్వామివారిని టీవీ హాస్య నటుడు వెంకీ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

ఎన్నికల బందోబస్తుకు సీఆర్‌పీఎఫ్ బలగాలు



సీఆర్‌పీఎఫ్ బలగాలతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బూర్గంపాడు మండలంలో 100మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను సిద్ధంగా ఉంచామని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం బూర్గంపాడుకు చేరుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలకు విధి నిర్వహణ స్థానాలు, విధులను కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలందరు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగబిక్షం, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలోని వనదుర్గాంబిక సమేత వన లింగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ముందుగా అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో కార్తీక అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సర్పంచ్‌లు సోని శివశంకర ప్రసాద్, ఉప సర్పంచ్ కాశీ కాళాహస్తి, గ్రామ పెద్దలు తోట వెంకట స్వామి, గడ్డం వెంకటేశ్వరరావు, సంగీతం వీర్రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీల విస్తృత ప్రచారం

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చానాగేశ్వరరావు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా రెండోసారి గెలిపిస్తే నియోజవర్గమును అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి వజ్జా శ్యాములు ప్రజలకు ఆదివారం విజ్ఞప్తి చేశారు. బహుజనులందరికి న్యాయం జరగాలంటే బీఎస్‌పితోనే సాధ్యమన్నారు. 30న జరిగే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు.

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కల్లూరి కిషోర్‌ను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యర్థి కల్లూరి కిషోర్, జిల్లా నాయకులు ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, కొర్సా రామకృష్ణ, మడకం విజయ, పద్మ, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలు



మణుగూరురూరల్: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి: హరిహరులకు హారతులు ఇస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కొనేటి స్నానాలు చేసి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని, కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమాన్ని జరిపించారు. సాయంత్రం ఆకాశదీపం, జ్యోతిర్లింగార్చన, జ్వాలా తోరణం, హరిహరులకు కొనేటి హారతుల కార్యక్రమాలను జరిపించారు.

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ రావు గంగాధరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మల్లేశ్వరునికి పలు పూజా ఘనంగా నిర్వహించారు. వేకువజామునుండే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో జ్వాలా తోరణం, సహస్ర దీపాలంకరణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు వేలాది సంఖ్యలో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.

మణుగూరురూరల్: పవిత్ర కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మారుమోగాయి. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తెల్లవారుజామునే శివాలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శివలింగాపురంలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో, అశోక్‌నగర్‌లోని భవానిశంకర ఆలయంలో, పీవీకాలనీలోని చక్రసహిత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో, గుట్టమల్లారంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో, కొండాయిగూడెంలోని శ్రీవైద్యనాదలింగేశ్వరస్వామి భక్తులు కార్తీకమాస దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని కన్నులారా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హోరెత్తిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



చంద్రుగొండలో జారె ఆదినారాయణ ఎన్నికల ప్రచార ర్యాలీ..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. అయన్నపాలెం గ్రామశివారు నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని అన్ని వీధుల్లో సాగింది. వందలాదిమంది కార్యకర్తల నినాదాలతోపాటు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే గ్యారంటీగా అమలు చేస్తామని జారే హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు వేసి పదేళ్ల దురహంకార పాలనకు సాగనంపాలని జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు, దారం గోవిందరెడ్డి, కేశబోయిన నర్సింహారావు, మాజీ జెడ్పీటీసీ కమలమ్మ, రుక్మిణి, కృష్ణవేణి, బడుగు శంకర్, అన్వర్, వసీం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం కాలనీ, వినాయకపురం, దబ్బతోగు గ్రామాల నుంచి పలు కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి జారే ఆదినారాయణ, పార్టీ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్ సమక్షంలో కొవ్వాసి హరిబాబు, అబ్బాస్, ఎం.రాముడుతోపాటు మొత్తం 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు గేదల సురేష్, జూపల్లి ప్రమోద్, నంద్రు రమేష్, అల్లాడి రామారావు, నల్లపు లక్ష్మీపతి, ఎన్.నరసింహారావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం..



అశ్వాపురం: కల్యాణపురం ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి, ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, సీపీఐ, టీజేఎస్, వైఎస్సార్ తెలంగాణ పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు ఆదివారం మండల పరిధిలోని కల్యాణపురం నుంచి మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో పాయం వెంకటేశ్వర్లు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పలు గ్రామాలలో జరిగిన కార్నర్ సమావేశాలలో పాయం వెంకటేశ్వర్లు మాట్లాడారు. నిరంకుశ బీఆర్ఎస్ పాలనకు తగిన గుణపాఠం చెప్పి ప్రజలు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓట్లు వేసి తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్‌రావు, వైఎస్సార్‌టీపీ నాయకులు సోమేశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బట్టా విజయగాంధీ, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి భిక్షమయ్య, ముత్తినేని సుజాత, వాసు, ఓరుగంటి రమేష్, వేములపల్లి రమేష్, సదర్‌లాల్, చంద్రకళ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం..



మణుగూరుటౌన్: రాజుపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మణుగూరుటౌన్: మండలం, పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకూ తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ పాటలకు నృత్యాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రచారంలో ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, పాల్వంచ రాములు, డాక్టర్ కల్యాణ్, గాండ్ల సురేష్, బత్తుల నవీన్, కొత్తపల్లి సత్యనారాయణ, చల్లా రాము, బత్తుల కోటయ్య, పెనుగొండ సాంబశివరావు, కుర్రం రవి, వాగబోయిన శ్రీను, రాము, జగన్, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.